# అది ఆదర్శం ఇది నిజం

గోపాలరావు చలపతి పెళ్ళిని మళ్ళీ విసుక్కున్నాడు.

అప్పటికి పదిసార్లకు పైగా విసుక్కున్నాడు.

మధ్యాహ్నపు మండుటెండ. ఉన్న కాస్త గాలీ పైరు లేని పొలాల్లో ఇంకిపోయింది.

కాళ్ళు పీకుతున్నాయి. సంచి బరువు ఎడం చేతిలోకి మార్చి, కర్చీఫును జేబులోంచి తీసి, ముఖాన పులుముకున్న చెమటను తుడుచుకుంటూ దూరంగా చూశాడు.

దూరంగా ఓ ఊరు. గుబురుగా ఉన్న చెట్ల వెనకాలే దాగి ఉంది.

గోపాలరావుకి ఉత్సాహం కలగలేదు. ఎందుకంటే, అది తను చేరవలసిన ఊరు కాదు. దాని వెనకాల తను నడిచేటప్పటికి ఓ ఊరుంటే, తను వెళ్ళేటప్పటికి రాత్రి అవకుంటే — ఆ ప్రయాణానికో అర్థం. కర్చీఫ్ తీసేటప్పుడు కింద పడ్డ ఉత్తరాన్ని చూశాడు. చెమట తన అడ్రసును చాలావరకు చెరిపివేయగలిగింది. కవరు కంటుకున్న మట్టిని విదిలించి మరో సారి చదివాడు. 'ఛస్ ... చలపతి గాడి ఊరు చేరడం, వాడి హాండ్ రైటింగ్ అంత నీట్‌గా ఉంటుం దనుకోవడం తన బుద్ధి తక్కువ.' నిర్లక్ష్యంగా జేబులో కుక్కాడు ఉత్తరాన్ని.

మళ్ళీ నడక సాగించాడు.

• * *

గోపాలరావు చలపతికి బంధువైతే సరిపోయేది. చిన్నప్పటి మిత్రుడు. అందుచేత అతని పెళ్ళికి రావడం తప్పని సరి. తప్పనిసరి అని రాలేదు. అది ఏ యాదగిరి గుట్టలోనో, తిరుమలలోనో అయితే ససేమిరా వెళ్ళేవాడు కాదు. పల్లెటూరు. తనెప్పుడూ చలపతి ఊరు చూడలేదు. పల్లెటూళ్ళో జరిగే పెళ్ళి అట్టే బోరు కొట్టదని వచ్చాడు.

ఆ ఊరికి చుట్టుపక్కల ఉన్న చలపతి స్నేహితులు వచ్చారు. ఆ ఊరిని అదివరకు ఎరిగిన దూరపు స్నేహితులెవరూ రాలేదల్లే ఉంది.

కళ్యాణమండపం. పురోహితుల మంత్రోచ్చారణ, మధ్య మధ్య వాళ్ల అదిలింపులకు భజంత్రీల అట్టెండెన్సు.

ఎక్కడ చూసినా ఆడవాళ్ళు — పైట జారిపోతున్నా, చీర నలుగుతున్నా లెక్క చేయనంత బిజీ. ఓ మూల కొబ్బరి మట్టల దగ్గర పిల్లలు. వాళ్ల ముఖాల్లో కోటి కాంతులు. వచ్చేవాళ్ళు, సర్దుకుని కూర్చునే వాళ్ళు.

గోపాలరావుకి పెళ్ళంటే తగని ఇష్టం. పెళ్లిలో ఓ మెజెస్టీ ఉందంటాడు. చుట్టాలు పక్కాలు, ఎంతున్నా అమ్మెప్పు రాని పతపాలు, విరబూసిన మల్లెల్లాంటి నవ్వులతో పిల్లలు, భజంత్రీల మేళాలు, వీళ్లందర్లో తీరిగా, గోలగా వినిపించే పురోహితుని మంత్రాలు, అవి శ్రద్ధగా విని అర్థం కాకపోయినా తలాడించజేసే ట్రెడిషనల్ ఇన్‌స్టింక్ట్సు — ఇవన్నీ.

తనకు తెలియకుండానవ్వుకుంటున్నాడు గోపాలరావు. తన పక్కగా ఒదుక్కుంటూ వెళ్లారు ఇద్దరమ్మాయిలు. వాళ్ల వెనకాలే వచ్చిన ఇస్త్రీ మడతల్లోని పెద్ద మనుషులు అక్కడున్న పట్టె మంచాల్లో సర్దుకున్నారు.

అదివరకు ఇద్దరు ముగ్గురు అడిగిన వట్లే అడిగారు —

"ఏ ఊరండీ?" అని. చెప్పాడు.

"స్నేహితులా?" అవును.

"ఉద్యోగమా?" ఎక్కడ పనిచేసేదీ చెప్పాడు. ఆ తరవాత ప్రశ్న తనకు తెలుసు. జీతం. తన జీతం అట్టే తక్కువ కాకపోయినా అది అడుగుతారేమోనని, అలా దేనికోసమో వెతుకుతున్నట్లు పెళ్లి మండపం వేపు చూశాడు.

చలపతీ, అతనికి కాబోయే కళత్రం, వాళ్ళూ, వీళ్ళూ, తనకి తెలియనివాళ్ళూ ... ఆ తరవాత ...

గోపాలరావు ఆగాడు.

అక్కడున్న వాళ్లలో ఓ అమ్మాయిని, ఆ సన్నటి అమ్మాయిని—ఒడిలో పిల్లవాడు కూడా ఉన్నాడు — ఆమెను, ఆహా ఆ అమ్మాయిని ఎక్కడో చూసి నట్లు — ఎక్కడ? ఎక్కడ? ఎక్కడబ్బా!

• • •

ఇంజనీరింగ్ డిగ్రీ పుచ్చుకున్న తొందర్లో, కనపడిం దానికల్లా అప్లై చేశాడు. ఒక రోజు రిప్లైలో 'ఇంటర్వ్యూ' అని ఉంది. ఇంటర్వ్యూ అయింది. ఆ మర్నాడే సెలక్షన్ లిస్టు వేస్తామన్నారు.

"డీసెల్ లోకో వర్క్సు సైటుకి చాలా దూరం. మీరు ఇంతదూరం రానక్కరలేదు. ఫోన్‌లో తెలుసుకోవచ్చు" అన్నాడు ఓ సూపరింటెండెంటు. ఫోన్ నంబరు నోట్ చేసుకొని వచ్చాడు. ఇక పోతే చూడవలసింది సిటీ. అవకాశం పోతే తిరిగి రాదు. అంతా కాకపోయినా ముఖ్యమైనవి చూడా లనుకున్నాడు—దశాశ్వమేధ్, విశ్వనాథ్ మందిర్, మణికర్ణిక, కాలభైరవాలయం, దాల్మండీ, దుర్గా కుండ్ ...




ఇంకోసారి ఎప్పుడైనా గోపాలరావుని కదిలిస్తే తన బెనారస్ ప్రయాణాన్ని గురించీ, వారణాసి యాంటిక్విటీని గురించీ పూస గుచ్చినట్లు చెప్పేవాడు. ఇప్పుడు ఓ అమ్మాయి తాలూకు ఆలోచనలు అతన్ని తరుముతున్నాయి. అంతా తిరిగి లక్సాలో ఆగాడు. తనెక్కవలసిన సిటీ బస్సు అక్కడే. అరగంటకి కానీ రాదు. అక్కడున్న చాలా మంది హిందీలోను, మొరటుగా ఉన్నవాళ్లు అర్థంకాని హిందీ లాంటి భాషలోను, పండితుల్లా కనిపించిన ఇద్దరు ముగ్గురు సంస్కృతంలోను మాట్లాడుకుంటున్నారు. మూడు రోజులైంది తెలుగు విని. పొరుగింటి అరవం అక్కడక్కడా విన్నాడు. మనవాళ్లెవరూ కనపడకపోయినా, మన భాష వినపడకపోయినా ఇక్కడ మనుషుల్లోని అనునయం బాంధవ్యంలా పెనవేస్తుంది. పురాణకాలం జ్ఞప్తికి తెప్పిస్తుంది. సెలక్షను వస్తే తనిక్కడ ఉండడం నిస్సందేహం!

ఉలిక్కిపడ్డాడు. తెలుగు. ఆడవాళ్ల గొంతు. వెనక్కి తిరిగాడు. ఇద్దరు వయసులో ఉన్న ఆడవాళ్లు. వాళ్లలో సిటీ కల్చర్ ఉట్టి పడుతూంది. ఆ వెనకాలే వినయంగా నడుస్తున్న ఓ అమ్మాయి—నిజంగా అందమైంది. ఆ అమ్మాయి ఎటో చూస్తూంది.

పొడుగ్గా, సన్నగా ఎర్రటి శరీరం. గడుగ్గాయిల్ని సైతం పల్టీలు కొట్టించే సన్నగా ఉన్న కోటేరు లాంటి ముక్కు. అక్కడి వాళ్లకు మల్లే అతికించుకున్న బొట్టు కాదు. తీర్చిన కనుబొమలు. నుదుటి మీద అందంగా తిలకం. రింగులు, చెవుల్ని కప్పుతున్న కురులు. ఎందుచేతనో కళ్లు ఎర్రగా ఉన్నాయి. బస్తీల్లో ఉండే ఆడపిల్లల ధైర్యం లేదు. తెలుగు అమ్మాయి కదూ!

వాళ్లు ఇటే వచ్చేశారు. వెనకాలే నిలుచున్నారు. ఆ అమ్మాయి అప్పుడప్పుడూ కళ్లు వత్తుకుంటూంది. వాళ్ల మాటలు

అతన్ని చేరడం లేదు. అసభ్యాన్ని అవతలికి నెట్టి, వాళ్ళ తెలుగు కోసం తపించాడు.

"నీతి, సొసైటీ, పేరు, ప్రతిష్ఠ" — ఇలాంటివి అంటున్నారు, ఆ అమ్మాయి పేపు చూస్తూ నిరసనగా. పాపం, పరీక్ష తప్పిందేమో? అయినా ఇది రిజల్ట్స్ టైము కాదే!

"పరువు, మర్యాద గంగలో కలిపా" వంటున్నారు. గోపాలరావుకి క్యూరియాసిటీ ఎక్కువైంది.

"నీ వెనక పెళ్ళి కావలసిన వాళ్ళు — అయినా మన వంశంలో లేంది! ..." అర్థమయింది గోపాలరావుకి. అయితే కొంత తన ఊహ లేకపోలేదు.

ఆ అమ్మాయి ఎవర్నో ప్రేమించి ఉంటుంది. అగర్భ శత్రువైన ఏ మరో ఆడదాన్నడిగినా ఆ అమ్మాయి అందం విషయంలో అబద్ధం చెప్పదు. **అందుచేత తన ఊహ నిస్సందేహం. ఆ అమ్మాయి ఎందరిచేతనో ప్రేమించబడి ఉంటుంది.** (ఇప్పటి దాకా తనుమాత్రం!) ఇంతలో వాళ్ళ కుదుపుతో ఆగిన బస్సువేపూ, ఆ అమ్మాయీ వాళ్ళ వెనకాలే బాధతోనూ నడిచి వెళ్ళిపోయారు.

బస్సు అక్కణ్ణుంచి లేచి పోయింది. గోపాలరావు చుట్టూ ఆలోచనలు ముసురుకున్నాయి.

పాపం, ఆ అమ్మాయి మంద నుంచి వెలివడ్డ మేకపిల్లలా భయపడిపోతూంది. వాళ్ళింటికి వెళుతుంది. కొద్ది రోజులు నరకం గడుపుతుంది. ఈ విషయం అప్పుడే అందరికీ గుప్పుమని ప్రాకి ఉంటుంది. అతను రాడు. వచ్చి పెళ్ళి చేసుకుంటాడేమో? అయితే మంచిదే!

వాళ్ళమ్మా, నాన్నా — ఆడ రాబందులూ, మగ నక్కలూ అన్నీ వెకిలిగా చూస్తాయి కాబోలు. ఆ వెనక ఆ అమ్మాయి ప్రేమను సొసైటీ కొరడాలతో టేప్ చేసి ఎవడికో అమ్ముతారు.

ఈ కథ తెలిసిన కసాయి వాడెవడూ తక్కువ ధరకు ఒప్పుకోడు.

అందరూ వెళుతున్నారు, అప్పుడే ఆగిన బస్సు వేపు.

కండక్టర్ని విన్నాడు — కమచ్చా, యూనివర్సిటీ.

అదే తన బస్సు. ఆలోచనల్లోంచి తేరుకొని వాళ్ళలో దూరి బస్సులో పడ్డాడు గోపాలరావు.

ఆ మర్నాడు ఫోన్ చేసి కనుక్కుంటే తను సెలెక్టు కాలేదని తెలిసింది.

అదే మొదటి ప్రయత్నం. ఆ నిరుత్సాహం ఈ ఆలోచనల్ని పూర్తిగా చెరిపేసింది. పేరు విన్నట్టు జ్ఞాపకం. అదీ మరిచిపోయాడు.

"మాంగల్యం తంతు నానేన ..." మంగళ వాద్యాల తారస్థాయిలో ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు. పెళ్ళికూతురి మెడలో మూడు ముళ్ళూ వేసి తన కళత్రమయిందనిపించుకొని సర్దుకుని కూర్చున్నాడు చలపతి. చలపతికి తెచ్చిన ప్రెజంటేషన్ ఎవరి చేతనూ పంపలేదు. ఆ అమ్మాయిని దగ్గరగా చూడాలని వెళ్ళాడు మంటపం దగ్గరికి. నిర్ధారణ చేసుకున్నాడు. మెళ్ళో పలచటి గొలుసు. అయ్యో! ఇంకా పెళ్ళికాలేదు. తన ఊహ కరెక్టే. అందరికీ ఆ విషయం తెలిసి ఉంటుంది.

గోపాలరావు మనసుని ఆ అమ్మాయి ఆక్రమించుకుంది.

**ఎంత నేర్పుగా జీవితంతో ఆడినా కొందరు అనుకోకుండా 'ఫౌల్' అయిపోతారు. ఆ అవమానం కంటే 'అవుట్' అవడం వేయిరెట్లు నయం అనిపిస్తుంది తరవాత. ఆదర్శం ముసుగులోంచి నిజం నగ్నంగా బయటపడితే కాని గెలుపు ఓటములు తెలియవు.**

ఈ విషయంతో తమ కేమీ సంబంధం లేనట్లు ఎక్కడివాళ్ళక్కడ తమ తమ పనుల్లో లీనమయ్యారు. పెళ్ళి పందిరి పలచబడింది.

* * *

పెళ్ళితాలూకు ప్రాసీజరుతో చలపతితో తీరిగ్గా మాట్లాడ్డం కుదరలేదు.

ఆ సాయంకాలం ఇద్దరూ చెరువు గట్టున షికారుగా వెళ్ళినప్పుడు చలపతిని కదిలించబోతూ, మళ్ళీ ఓసారి తన్ను తాను విమర్శించుకున్నాడు. ఆ రోజున తను చూసిన అమ్మాయిని తనేమైనా ప్రేమించాడా?

రోజుల తరబడీ ఒళ్ళు పూనుకుని తిరిగి, డైలాగుల్లో ఒలకబోసుకునే ప్రేమంటే అతని కసహ్యం.

ఆ అమ్మాయి అంటే అప్పట్లో జాలీ, కరుణా, ప్రేమా. ఇప్పుడూ అంతే.

"మీ ఆవిడకు బెనారస్ చీర ప్రెజంట్ చేసిం దెవర్రా?"

"వాళ్ళ చుట్టాలే — కరుణ అని."

"ఇంకా పెళ్ళి కాలేదల్లే ఉందిగా? లలిత కంటే పెద్దదే!"

చలపతి గోపాలరావు ముఖంలోకి చూశాడు ప్రశ్నార్థకంగా.

"వాళ్ళ పెద్దవాళ్ళతో మాట్లాడమని నాన్నతో చెప్పు. ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాను."

చలపతి ఇబ్బందిగా చూశాడు. బహుశా కరుణ సంగతి తనతో ఎలా ప్రస్తావించాలా అనుకొంటున్నాడేమో?

"ఏమిటి అలా చూస్తావు?"

"నీకు తెలియదులేరా! అదంతా ఓ కథలే!"

"ఆ కథ నాక్కూడా తెలుసు."

"ఎలా తెలుసు?"

గోపాలరావు చెప్పాడు.

గోపాలరావు లాంటి మంచి స్నేహితుడున్నాడని చలపతి మరొక్క సారి గర్వపడ్డాడు. అందరూ గోపాలరావు లాంటివాళ్ళుండరు.

చలపతి చిన్నగా నవ్వి, "ఇదంతా నిజమే కానీ, నువ్వు చూసింది కరుణని కాదు" అన్నాడు.

అర్థం కావట్లు చూశాడు గోపాలరావు.

"అరుణ, కరుణ కవల పిల్లలు. వాళ్ళ పెద్దన్నయ్యతో బెనారస్‌లో ఉండేవాళ్ళు. అరుణ ఎవరితోనో లేచిపోయిన మాట నిజమే. ఆ తరవాత నెల తిరక్కముందే అరుణ లేదు."

"మళ్ళీ వెళ్ళిపోయిందా ... అదే నేను ..."

చలపతి కట్ చేశాడు. "పాపం! అరుణ చచ్చిపోయిందట."

"మరి?"

"కరుణకు పెళ్ళి కాలేదనా? మంచి సంప్రదాయ కుటుంబంలో ఇలాంటివి జరగడం చేతనో, కవల పిల్లలు కావడం చేత కరుణకు కూడా అలాంటి ఆలోచనలున్నాయన్న భయంచేతనో వచ్చిన వాళ్ళు అలానే వెళ్ళిపోతున్నారు."

గోపాలరావు మౌనంగా నడుస్తున్నాడు.

అరుణ చచ్చిపోయి ఉండదు. ఆ నాటి వాతావరణం అరుణను హత్య చేసి ఉంటుంది. ఆత్మహత్య కాదుగదా? పైకి వచ్చే మాటని ఆపుకున్నాడు.

పాపం! అరుణ ఆత్మహత్య చేసుకుంది. అరుణ బ్రతికుంటే సరిగా అర్థం చేసుకో గలిగే తనలాటివాళ్ళెవరూ అరుణను భార్యగా స్వీకరించడానికి వెనుకాడరు. అరుణ లేదు.

బ్రతికున్న కరుణ మాటేమిటి?

గోపాలరావు తన నిర్ణయం మార్చుకోననీ, వాళ్ళ నాన్నతో ఈ విషయం ప్రస్తావించమనీ చలపతికి చెప్పాడు.

ఆ తరవాత ఆర్నెల్లకు చలపతి ఓ పెళ్ళిపెద్ద నయ్యాననే గర్వంతో మురిసిపోయాడు—కరుణనీ, గోపాలరావునీ వధూవరులుగా చూస్తూ.

* * *

అగరువత్తులు, మల్లెపూలు, అందంగా అమర్చబడ్డ పందిరి మంచం. ఫ్లోరిసెంటు లైటు ఉత్సాహం పట్టలేక నవ్వుతూంది, వెన్నెలగా.

తలుపు చప్పుడయింది — కరుణ.

అరుణ చెల్లెలు గానే కరుణని చూచి వెనక్కి వెళ్ళిన వాళ్ళు మూర్ఖులు. లేచాడు. గంభీరత కొట్టవస్తూంది. ఎదురుగా వెళ్ళాడు. అతనిలోని సమర్థత మరింత నిండుతనం తెచ్చింది.

అరుణ సంగతి తనకి తెలుసుననీ, అయినా పెళ్ళి చేసుకోవా లనుకున్నాననీ కరుణతో చెప్పాలి. కరుణ ఇందుకు తనను ఆరాధిస్తుంది. అమితంగా ప్రేమిస్తుంది, కరుణకు తను దగ్గరౌతున్నాడు.

వంగి అతని పాదాలను తాకింది. అలవోకగా లేపి, "అది కాదు నీ స్థానం" అంటూ హృదయానికి హత్తుకున్నాడు.

అనాలోచితంగా అన్నాడు: "అరుణా!"

ఉలిక్కిపడింది అతని కౌగిట్లో ఉన్న కరుణ.

గోపాలరావు ముఖంలోకి తీక్ష్ణంగా చూసింది.

వాళ్ళక్కయ్య ప్రస్తావన అప్రస్తుతంగా గుర్తుకు తెచ్చినందుకు నాలిక కరుచుకున్నాడు.

"అమ్మ దొంగా! ఇంతసేపూ ఎంత తపించినా ఉలకవు, పలకవు. దించిన తల ఎత్తవు. చూశావా, నేనే గెలిచాను?"

"ఊఁ" అంటూ అలానే ఒదిగి పోయింది అతని ఒడిలో, గోముగా.

ఫ్లోరిసెంటు వెలుగు తుర్రుమని పారిపోయింది, గదిలోంచి.

దొంగచాటుగా కొబ్బరి మట్టల్లోంచి తొంగి చూస్తున్న చందమామను తెలి మబ్బు మందలించింది.

• •

కరుణతో తన జీవితం కలలా గడిచి పోతూంది గోపాలరావుకి. దానికి కారణం—

అతని హృదయాన్ని ఆకట్టుకొన్న అరుణను కరుణలో చూస్తూ, తనని ఆరాధించే కరుణని అరుణగా ఊహించు కుంటూ కాలం గడిపే వాడు. పెళ్ళయిన కొత్తల్లో అరుణ ఊసెత్తితే కరుణ మనసు తీవ్రంగా గాయపడేది. ఆ పూట అన్నం తినడానికి బ్రతిమాలవలసి వచ్చేది. కరుణకి అతనంటే ప్రాణం. కొత్తల్లో అయితే తను కూడా ఫాక్టరీకి వస్తా ననేది. ఒంటరితనాన్ని భరించలేనని వాపోయేది.

• • •

ఓ రోజు కరుణా వాళ్ల కజిన్ బ్రదర్ అకౌంట్సు బుక్స్ కావాలని ఉత్తరం




వ్రాశాడు. సెంట్రల్ ప్రెస్‌కు ఫోన్ చేస్తే ఫతే మైదాన్‌లో దొరుకుతాయని చెప్పారు. గోపాలరావు స్టేడియమ్ దగ్గర స్కూట రాపి, అక్కడున్న పెద్దమనిషిని అడిగాడు, సేల్సు ఆఫీసు ఎక్కడని. "రైట్ కార్నర్" అంటూ పరిశీలనగా చూసే ఆ పెద్ద మనిషి — "గోపీ!" అన్నాడు.

నల్ల కళ్లద్దాలు, కరకు మీసాలు, సైడ్ విస్కర్సు. వైట్‌లో టక్ చేసి ఉన్నాడు. గోపాలరావు కష్టంమీద గుర్తించాడు.

"మీరు శేఖరం గారు కదూ?"

"అవునయ్యా నేనే."

"పూర్తిగా మారిపోయారు. ఎక్క

డుంటున్నారు? ఏం చేస్తున్నారు?"

"పాటియాలాలో ఉంటున్నాను. ప్రస్తుతం హైదరాబాదు స్పోర్ట్స్ కౌన్సిల్ మీటింగుకి వచ్చాను. మీరెక్కడ?"

"హోటల్లో. హైదరాబాద్‌లో ఎక్కడ మకాం?"

"ఇక్కడే క్వార్టర్స్ ఇచ్చారు. నిజ్జీ, బోరుకొట్టి ఛస్తున్నామనుకో. ఒంటిగాళ్ళం కనక కంపెనీ ఉంటేనే గానీ కాలం గడవదు."

"మా ఇంటికి వెళదాం పదండి."

"ఇంకా రెండ్రోజులేగా?"

"ఒక్కరే కదండి. పెళ్ళి కూడా అవ్వలేదు."

పుస్తకాలు కొనుక్కొని స్కూటరు మీద ఇంటికి వచ్చారు.

శేఖరం అంటే గోపాల్రావుకి మంచి గౌరవం. స్కూల్లో ఎన్. సి. సి. లీడరు. ఆటలంటే తిండికూడా అక్కర్లేదు. కారమ్స్ ఎంత డెలికేట్‌గా ఆడతాడో, కబాడీలో అంతగా పులిలా దూకేస్తాడు. ఆరడుగుల మనిషి. కండలు తిరిగిన శరీరం. అతని ప్రాణమే అంత.

ఇంటికి వచ్చారు. కరుణ కాలనీలో ఎవరింటికో వెళ్ళడానికి తయారవుతూంది. అట్టే బింకం చెయ్యకుండా కాఫీ తెచ్చింది.

పరిచయం చేశాడు. "శేఖరం — నా మిత్రుడు."

శేఖరం విష్ చేశాడు. కరుణ చేతులు జోడించింది.

"కంపెనీ ఇవ్వలేనందుకు సారీ!" అంటూ పేరంటానికి వెళ్ళిపోయింది.

ఆ తరవాత లోకల్ పాలిటిక్సూ, చెస్‌లో ఎత్తుగడలూ, హైదరాబాదులోని రిక్రియేషన్ క్లబ్బులూ ...

మళ్ళీ కలుస్తానని చెప్పి వెళ్ళిపోయాడు శేఖరం.

• • •

కాలింగ్ బెల్ గణగణ మ్రోగింది. కరుణ తలుపు తెరిచింది.

శేఖరం! అదిరిపడింది కరుణ.

మౌనంగా లోపలికి నడిచాడు శేఖరం.

అతని బూట్ల చప్పుడు నిశ్శబ్దాన్ని డిస్టర్బ్ చేయలేదు.

"వారు లేరు." తొట్రుపాటును కప్పిపుచ్చుతూ, పైటను భుజాల మీదుగా కప్పుకుంటూ అంది కరుణ.

శేఖరం మాట్లాడలేదు. ఎదురుగా ఉన్న టేబిల్ దాకా వెళ్ళి చేతిలోని డైరీని గిరాటేసి, కరుణ వేపు తిరిగి చేతులు కట్టుకొని, టేబిల్ కానుకొని నిలబడ్డాడు.

"కూర్చోండి."

"కరుణా! నే నిలా మీ ఆయన లేనప్పుడు వస్తే నీకు అసభ్యంగా తోస్తే..." వ్యంగ్యంగా నవ్వుతూ అంటున్నాడు శేఖరం.

"ఇదివరకు నన్ను బాగా ఎరిగున్న నువ్వు, నన్ను ఎంత నమ్రతతో పలకరించావో గుర్తుకి తెచ్చుకో ..."

ముళ్ళలా గుచ్చుకున్నాయి అతని మాటలు. నిరసనగా చూసింది కరుణ. ఆ నిరసనలో ధ్వనించిన చీత్కారం శేఖరానికి వినిపించింది. అన్నాడు:

"అవును, నన్ను చూసిన వాళ్ళెవరూ నాకు హృదయ ముందని అనుకోరు. అది అబద్ధమని అందరితో చెప్పాల్సిన అవసరం నాకు లేదు. ఎంత నేర్పుగా ఆడినా జీవితంలో 'ఫౌల్' అయ్యాను. ఆ అనుమానం కంటే 'అవుట్' అవడం వెయ్యి రెట్లు నయం."

"మీ రనేది నా కర్థం కావడం లేదు." మాటలు కష్టం మీద పెగిలి వచ్చాయి.

"నిన్ను చూస్తూంటే జాలివేస్తోంది. నన్ను చూసి ఇంత ఆశ్చర్యం ప్రకటిస్తుంటే నవ్వు వస్తోంది." నవ్వాడు శేఖరం పొడిగా.

ఉలిక్కిపడింది కరుణ, తత్తరపాటును సర్దుకుంటూ.

"ఇప్పుడే వస్తాను" అంటూ ఇంట్లోకి నడుస్తూంది.

"కాఫీ అక్కర్లేదు." వారించాడు శేఖరం. "ఇక్కడే ఉండు." కూర్చున్నాడు. "విన్నట్టే విసిగించను." మాటల్ని పలకడంకోసం ప్రయత్నిస్తున్నాడు.

"కరుణా!" ఆర్ద్రంగా పిలిచాడు శేఖరం. ఆ పదానికి ఉన్న అర్థం అంతగా స్ఫురించేలా అత నెప్పుడూ అనలేదు.

"కరుణా, నాకూ హృదయ ముందని ఈ లోకంలో ఒక్కరికే చెప్పుకోవాలి."

కరుణకు అంతా అర్థమయింది. ఇంకో క్షణంలో తన కల అంతా కరిగి పోతుందన్న బాధ ఉప్పెనలా తాకింది.

శేఖరానికి అవసరమైన క్షణం అదే! తీక్ష్ణంగా చూస్తున్నాడు. శేఖరం చూపులు ఎంతటి చేదునిజాన్నయినా చెప్పిస్తాయి.

వేదనతో అడుగుతున్నాడు. ఆ వేదన ఎంతటి ఆవేదననైనా వెళ్ళగక్కిస్తుంది.

భారంగా పడుతున్నాయి శేఖరం అడుగులు. ఆ భయానికి నిశ్శబ్దం పారిపోయింది. పులిలాంటి శేఖరం అడుగుల చప్పుడు, ఆ శేఖరంతో తనొకప్పుడు కుతకుత లాడిన బాధ, అందరి మంచితనం మూర్తీభవించుకొన్న భర్త...

కరుణ నిలువెల్లా కంపించిపోయింది. అప్పటికి శేఖరం ఊహ నిజమైంది.

"అరుణా!" పెద్దగా పేరెట్టి పిలిచాడు.

"రాజా!" వెక్కి వెక్కి ఏడుస్తూ సోఫాలో కూలబడింది.

రాజా వెళ్ళలేదు; అరుణను ఓదార్చనూ లేదు.

తనను తాను నిగ్రహించుకొని, కళ్ళు తుడుచుకుంటున్న అరుణతో అన్నాడు:

"కసాయివాడిలా కనిపించినా, నా లోని మానవత్వాన్ని నిరూపించుకోవడానికి వచ్చాను."

బాధగా చూసింది అరుణ.

నిన్నేం చేయను — అన్నట్లున్నాయి అతని చూపులు.

నేను చచ్చిపోయాను — అన్నట్లున్నాయి అతని ముఖ కవళికలు.

ఆ నిజం కోసం అంతవరకూ నిర్జీవంగా బ్రతుకుతున్న రాజశేఖరం అక్కణ్ణుంచి లేచిపోయాడు.

కాఫీ అందిస్తూ అంది కరుణ:

"మీకోసం రాజాగారు వచ్చారు."

"రాజెవరు?" అర్థంకాక అడిగాడు గోపాల్రావు.

"ఆఁ— అదే ... రాజశేఖరంగారు..."

కరుణ లోని తొట్రుపాటును గోపాల్రావు గ్రహించాడు.

రాజశేఖరం పూర్తిపేరు కాబోలు. తనకు శేఖరం మాత్రమే తెలుసు. కరుణకు రాజా ఎలా తెలుసు?

కాఫీ తాగడం లేదు. మింగుతున్నాడు. కరుణ వెళ్ళిపోయింది తన ఎదట్నుంచి. తనలో ఆదుర్దా రాకుండా ఎంతో సర్దుకుంటున్నాడు. కరుణకు తనలో ఇలాంటి ఆలోచనలు రేగుతున్నాయని తెలియకూడదు. ఖాళీ కప్పు టేబిల్ మీద పెట్టి వంటింట్లోకి వెళ్ళాడు.

"రాజశేఖరం ఏం చెప్పాడు, కరుణా?"

"వారు రేపో ఎల్లుండో వెళతారట— చెప్పిపోయారు. డైరీ ఇక్కడే మరిచి పోయారు."

• • •

ఆ సాయంత్రం స్పోర్ట్స్ కౌన్సిల్‌కి వెళితే, శేఖరం అక్కడ లేడని ఆబిడ్స్‌లో ఉన్న ఓ హోటలు అడ్రసిచ్చారు.

కర్టెన్ తొలగించి లోపలికి చూశాడు. సిగరెట్ పొగలో శేఖరం సరిగ్గా కనిపించడం లేదు. టేబిల్ మీద విస్కీ, సోడా బాటిల్సూ, ఆష్ట్రే, నాలుగు పెగ్గులూ.

"కమిన్, గోపాల్! నీకోసమే చూస్తున్నాను. టేక్ యువర్ సీట్." రేను పుస్తకాన్ని నిశితంగా చూస్తున్నాడు శేఖరం. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. అడిగాడు: "ఉడ్ యూ లైక్ టు హేవ్?" పడుకున్నవాడు లేచి పలకల సీసాలోని విస్కీని గుండ్రటి గ్లాసులో పోశాడు.

"నో, థాంక్స్. — అలవాటులేదు."

"ఎట్‌లీస్ట్ బీర్?"

అడ్డంగా తల ఊపాడు గోపాల్రావు. అడిగాడు: "రేపే వెళుతున్నారా?"

"లేదు. రేపు లాస్ట్ డే. ఎల్లుండి వెళతాను."

సోడా శబ్దం చేస్తూ విస్కీని పలచబరుస్తూంది.

"శై దిశై ..." మాటలు అలస్యంగా వస్తున్నాయి. "నువ్వు ఒక్కసారైనా బ్రాందీ తాగలేదా?"

"లేదు."

"కారణం?"

"సింపుల్ — నా కలాంటి బలహీనత లేదు."

"మరేముంది?"

గోపాల్రావుకి చిరాకేసింది. పసిపిల్లనైనా సముదాయించవచ్చు. కానీ, తాగినవాళ్ళతో మాట్లాడ్డం కష్టం.

"ఇల్లు, ప్రేమించే పెళ్ళాం."

"ఐ సీ! నాకు పెళ్ళి కాలేదనీ, ఇల్లు పట్టదనీ, అందుకే ఇలా తయారయ్యానని అంటావు. అవునా?" అన్నట్టు చూశాడు.

"అని నే ననలేదు."

శేఖరం లేచాడు. గళ్ళ లుంగీ, ఎర్ర గ్లాసూ. కిటికీ దగ్గర నిలబడి బయటికేసి చూస్తున్నాడు.

"సారీ! నువ్వు లేనప్పుడు మీ ఇంటికి వచ్చాను. మీ శ్రీమతి నా మీద రిపోర్టు చేయలేదు గదా?" తన డైరీని అక్కడ పెడుతున్న గోపాల్ వేపు చూసి అన్నాడు.

"లేదు. కావలసినంత సస్పెన్సు ఇచ్చింది."

"ఏమని?" నిషాలో నవ్వాడు శేఖరం.

"మిమ్మల్ని రాజా అంటే నాకో పట్టాన జ్ఞాపకం రాలేదు."

"నా పేరు శేఖరమే. కానీ రాజా నాకు తెలుసు."

అర్థంకాకుండా మాట్లాడుతున్న శేఖరాన్ని చూస్తుంటే గోపాల్రావుకి జాలేసింది. శేఖరం బొమ్మకు అవతలి వేపు బోరుమని చూస్తుంటే ఆశ్చర్యం వేసింది.

"రాజెవరు?" తమాషాగా అడిగాడు గోపాల్రావు.

"గోపాల్! జీవితంతో ఎంత నేర్పుగా ఆడినా నేనే ఓడిపోయాను. అరుణ అనే

అమ్మాయి నన్ను ప్రేమించింది. అరుణతో ఆడుకున్నాను."

గోపాల్రావు బొమ్మలా అయిపోయాడు.

దగ్గరగా వచ్చాడు శేఖరం.

"ఆశ్చర్యంగా ఉందా, గోపాల్?"

తన కీ విషయం తెలుసు. ఆశ్చర్యం అందుకు కాదు — అరుణతో లేచిపోయిన అతన్ని చూస్తాననుకోలేదు. కరుణ కీ విషయం జ్ఞాపకం వస్తే, కంగారుగా "రాజా" అని సంబోధిస్తే కరుణని అపార్థం చేసుకున్నాడు.

"అమూల్యమైన అరుణ ప్రేమని అర్థంచేసుకోలేని వాడొకడు రాజా. అప్పుడప్పుడూ వస్తుంటాడు — ఇడియట్! వాడు తాగుతాడు."

"శేఖరంగారూ, పరిస్థితులు మనుష్యుల్ని టెస్ట్ చెయ్యనివ్వ కూడదు. నా కీ విషయం పూర్తిగా తెలుసు. టేక్ ఇట్ ఈజీ!"

సీసాలో మిగిలిందల్లా గ్లాసులో నింపాడు.

"నీకు ఏమీ తెలియదు, గోపాల్! నువ్వు అమాయకుడివి, మంచి వాడివి. నీ హృదయం మంచితనంతో నిక్ —"

వెక్కిళ్లు ప్రారంభమయ్యాయి.

"ప్లీజ్, శేఖరం! నిన్న మా ఇంటికి మీరు వచ్చినప్పుడు మా మిసెస్ మిమ్మల్ని హర్ట్ చేయలేదు కదా? షి ఈజ్ ఇన్నొసెంట్. మిమ్మల్ని సరిగా అర్థంచేసుకుని ఉండదు. అలా అయితే మన్నిస్తారని ..."

"వ్..." సంజాయిషీ చెబుతున్న గోపాల్ని శేఖరం వారించాడు.

"గోపాల్, నిన్ను మంచితనం వరించింది."

గ్లాసులోని విస్కీని గడగడ తాగేశాడు.

"ఆ వాడు నా ఆటలో పావైన అరుణ హృదయం కూడా నిన్ను ఆరాధించింది.

నీ మంచితనం నన్ను వెక్కిరిస్తోంది.

ఈ నిషా నిజం చెప్పమని నిలవేస్తోంది.

"గోపాల్ ... చచ్చిపోయింది నీవూ నేనూ ఎరుగనికరుణే! అరుణ ఇంకా బ్రతికే ఉంది ..."

"అంటే?" గోపాల్రావు గొంతులో తడి ఆరిపోయింది.

"నాతో లేచి వచ్చిన అరుణకు పెళ్లి కాదని, ఆ తరవాత అయిదు నెలలకు హాస్పిటల్లో చనిపోయిన కరుణను అరుణగా మార్చేశారు.

అరుణని కరుణగా అందరికీ చెప్పేశారు"—

# మార్గదర్శులు



40

© First Features

## ఇంగ్లీష్ ఛానల్ దాటి...

మొదటిసారి విమానంలో ఇంగ్లీష్ ఛానల్ దాటినది ఛార్లెస్ స్టెవార్ట్ రోల్స్ అనే బ్రిటిష్ కార్ల నిర్మాత. అది 1910 లో. రాయిస్‌తో కలిసి ఈయనే రోల్స్‌రాయిస్ కార్లు నిర్మించాడు.

రైట్ సోదరులు నిర్మించిన బైప్లేన్‌లో రోల్స్ ఛానల్ దాటాడు.

గాలివాటు, అనుకూల వాతావరణం కోసం డోవర్‌లో వేచిఉండి జూన్ 2 న ఛానల్ దాటి కేలెయ్స కి సంగట్టే దాకా వెళ్లాడు.

అక్కడ తాను చేరినట్టు ఉత్తరం ఒకటి ఫ్రెంచి ఏరోక్లబ్బుకు పోస్ట్ చేసి, డోవర్‌కు తిరిగి వచ్చి దిగాడు. ఈ యాత్ర 90 నిమిషాలు సాగింది.

అలాగే అతను ఇంగ్లాండునుంచి ఫ్రాన్సుకు తొలి విమాన ప్రయాణం కూడా చేశాడు. ఆ తరవాత ఒక నెలకు విమాన ప్రమాదంలో చనిపోయాడు.

ఆ మాటల్ని అనడంకోసం పుంజుకొన్న సిగరెట్ పఫ్‌ల పొగ గోపాల్రావుని చుట్టుముట్టేసింది.

గోపాల్రావు కేమీ కనిపించడం లేదు.

తనకు తెలియని రాజా — తెలిసిన శేఖరం.

తనకు తెలియని అరుణ — తెలిసిన కరుణ.

కళ్ల మూతలు పడుతున్న శేఖరం ఏదో అనడం — చూచాయగా తెలుస్తూంది.

"కానీ, గోపాల్, రాజా రూపం చెరిపేసుకున్న అరుణకు రాజాలో అరుణ ఇంకా బ్రతికే ఉందని తెలియదు."

గోపాల్రావుకి ఏమీ తెలియడం లేదు

తన చేతులు ఎర్రటి గ్లాసును—తన పెదాల దగ్గరకు తీసుకెళుతున్నాయని కూడా తెలియడం లేదు.

గోపాల్రావుకి ఇన్ని తెలియడంలేదని రాజశేఖరం ఇక ఎన్నటికీ తెలుసుకోలేడు.

నిలకడగా, అంతవరకూ అక్కడే నిలబడి వాళ్లిద్దర్నీ చూస్తున్న నిజం — తన నగ్న సౌందర్యాన్ని కప్పుకుంటూంది.

సంఘం చేనేత చీరలో — నిజం! — అది చాలా అందంగా కనిపిస్తూంది. ఆదర్శాన్ని వెక్కిరిస్తూంది. ★